సాక్షి
ములుగు
శనివారం । 22 । జూలై । 2023



నకిలీ మావోయిస్టుల అరెస్ట్

మావోయిస్టుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురి నకిలీ మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో▸



కనువిందు చేస్తున్న జలపాతాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో జలకళను సంతరించుకున్నాయి.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
28.0⁰ /23.0⁰

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలీసులకు రివార్డు



ములుగు రూరల్/ములుగు: రైతులను మోసగించి తప్పించుకు తిరుగుతున్న వ్యాపారిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను ఎస్పీ గాష్ ఆలం శుక్రవారం రివార్డు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు మండలంలోని కాశిందేవిపేట, దేవగిరిపట్నం గ్రామాల్లో సుమారు 138 మంది రైతుల వద్ద రూ.3 కోట్ల మిర్చిని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న వ్యాపారి ఇబ్రహీం అలియాస్ జానే మియాను సీసీఎస్ సీఐ రవీందర్, ఏఎస్ఐ సుధీర్, సైబర్ క్రైం కానిస్టేబుల్ జహూర్, ఐటీ కోర్ కానిస్టేబుల్ రాజేంద్ర ప్రసాద్, కానిస్టేబల్ రఘులు చాకచక్యంగా పట్టుకున్నారు. దీంతో వారికి రివార్డు అందించి అభినందించారు. రైతుల ఫిర్యాదు మేరకు నిందితుడిని రిమాండ్ చేసినట్లు తెలిపారు.

ఆదివాసీ విద్యార్థికి డాక్టరేట్



ఎస్ఎస్ తాడ్వాయి/ఏటూరునాగారం: మండలంలోని కామారం (పీటీ) గ్రామ పంచాయతీకి చెందిన ఆదివాసీ విద్యార్థి మైపతి అరుణ్‌కుమార్ శుక్రవారం వరంగల్ కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రమేశ్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. కామారం గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ ఆదివాసీ హక్కులపై పరిశోధన చేసినందుకు అరుదైన గౌరవం దక్కింది. ఆదివాసీల జీవన శైలి, అస్తిత్వం, విద్య, వైద్యం, వ్యవసాయం, ఐటీడీఏ పనితీరుపై అధ్యయనం చేసి పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ప్రొఫెసర్ టి.యాదగిరి పర్యవేక్షణలో అరుణ్‌కుమార్ తన పీహెచ్‌డీ పూర్తి చేశారు. అరుణ్‌కుమార్ డాక్టరేట్ పొందటంతో ఆదివాసీలు, దళిత, బహుజన సంఘాల నేతలు, తుడుందెబ్బ నేతలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళలపై దాడులు శోచనీయం



ములుగు: దేశంలో మహిళలపై దాడులు జరగడం శోచనీయమని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అదాని ఆస్తులు పెంచడం కోసం, 53 ఎకరాల్లో మైనింగ్ చేపట్టడానికి అక్కడి మహిళలపై విచక్షణా రహితంగా నగ్నంగా ఊరేగిస్తూ కొట్టిచంపుతున్నారని మండిపడ్డారు. ఈ ఘటనలపై పీఎం మోదీ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, ఎండీ అయూబ్‌ఖాన్, వంగ రవియాదవ్, కంబాల రవి, జగన్మోహన్ రెడ్డి, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, ఇర్సవడ్ల వెంకన్న, ఆయా మండలాల అధ్యక్షులు ఎండీ చాంద్‌పాషా, పాలడుగు వెంకటకృష్ణ, అప్సర్‌పాషా, వజ్జ సారయ్య, చింతనిప్పుల భిక్షపతి, నల్లెల భరత్, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సుంకరబోయిన మొగిలి, బండి శ్రీనివాస్, ఎంపీపీ విజయరూప్ సింగ్, జెడ్పీటీసీ పుల్సం పుష్పలతశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ బొక్కా సత్తిరెడ్డి పాల్గొన్నారు.

జీపీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని ఎమ్మెల్యే ధనసరి సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద జీపీ సిబ్బంది చేపడుతున్న 16వ రోజు సమ్మె కార్యక్రమానికి సీతక్క సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ జీపీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ దుప్పటి మొగిలి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 10వ తేదీలోపు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు (ఫైల్)



కంపుకొడుతున్న గ్రామాలు

జీపీ కార్మికుల సమ్మెతో పేరుకుపోతున్న చెత్త

- వర్షాలతో వ్యాధులు ప్రబలే అవకాశం

ఎస్ఎస్ తాడ్వాయి: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. ఈ నెల 6 నుంచి కార్మికులు సమ్మె చేస్తుండగా పారిశుద్ధ్య నిర్వహణ గ్రామాల్లో అస్తవ్యస్తంగా మారింది. చెత్త సేకరణ జరగకపోవడంతో రోడ్ల వెంట కుప్పలుగా పేరుకుపోతుంది. మరోపక్క వర్షాలు కురుస్తుండటంతో పరిస్థితి ఇంకా దయనీయంగా మారింది. అధికారులు వెంటనే స్పందించపోతే వ్యాధుల ప్రబలేప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండగా తాత్కాలిక సిబ్బందితో పనులు చేయించాలని ఆదేశించినా.. వారిని కూడా జీపీ సిబ్బంది అడ్డుకోవడంతో పనులు సాగడం లేదు. ఫలితంగా పలు గ్రామాల్లోని డ్రెయినేజీల్లో మురికి నీరు, రోడ్ల వెంట చెత్తాచెదారం పేరుకు పోయింది. కనీసం బ్లీచింగ్‌తో పాటు దోమల నివారణ మందులు కూడా పిచికారీ చేసే పరిస్థితి లేదు.



దామెరవాయిలో పేరుకుపోయిన చెత్త

సీజనల్ వ్యాధులతో ఆందోళన

అసలే వర్షాకాలం ఆపై పారిశుద్ధ్య లోపంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. పారిశుద్ధ్య కార్మికుల సమ్మెతో రోడ్ల వెంట చెత్తా చెదారం, డ్రెయినేజీల్లో మురుగు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తుంది. చెత్తా చెదారం దోమలు, ఈగలకు నిలయంగా మారాయి. అంతలోనే వర్షాలు మొదలుకావడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. పెరుగుతున్న దోమలతో పాటు వాతావరణ మార్పుతో సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉండటంతో ప్రజల్లో మరింత ఆందోళన నెలకొంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల వరదలకు గ్రామాల్లోని ప్రజలు వ్యాధుల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు.

సమ్మె విరమించం..



న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదు. జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 16 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన తమ సమస్యలను పరిష్కరించాలి.

-దబ్బగట్ల నారాయణ, జీపీ కార్మికుడు

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిశుభ్రతగా ఉంచాలి. కార్మికుల సమ్మెతో గ్రామంలో రోడ్ల వెంట చెత్తా చెదారం పేరుకుపోయింది. చెత్త కుప్పలు ఉండటంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు త్వరగా పరిష్కరించి, పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

- మోరే భిక్షపతి, దామెరవాయి, గ్రామస్తుడు

పనులు చేయిస్తున్నాం..

కార్మికుల సమ్మెను దృష్టిలో పెట్టుకొని తాత్కాలిక సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. కొన్ని చోట్ల జీపీ కార్మికులు పనులు చేయకుండా తాత్కాలిక సిబ్బందిని అడ్డుకుంటున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కార్మికులు సహకరించాలి.

- వెంకయ్య, డీపీఓ

బీఎల్‌ఓలే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- ఓటరు జాబితాను సమర్థవంతంగా రూపొందించాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మంగపేట: ఓటరు జాబితా రూపొందించడంలో బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌ఓ)లు కీలకమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రెండో స్పెషల్ సమ్మరీ రివిజన్ ట్రైనింగ్ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఖచ్చితమైన ఓటరు జాబితాను తయారు చేయడంలో బీఎల్‌ఓలది కీలకమైన పాత్ర అన్నారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయని, దీనిలో భాగంగానే 2వ ఎస్ఎస్ఆర్ నిర్వహించడం జరుగుతుందన్నారు. నూతనంగా ఓటరుగా నమోదు చేసుకునే వారికి ఫాం 6, తొలిగింపుకు ఫామ్ 7, సవరణలకు ఫామ్ 8 ఇవ్వాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌ఓ, ఆర్‌డీఓ సత్యపాల్‌రెడ్డి, మండల స్పెషలాఫీసర్ తుల రవి, ఏఈఆర్‌ఓ, తహసీల్దార్ ఎంపెల్లి శ్రీనివాసులు, ఏఎల్ఎంటీ డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన

మండలంలోని కమలాపురం ఆర్ఎంసీ పాఠశాలలో గోదావరి వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పాటు గోదావరి వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని మండల స్పెషలాఫీసర్ తుల రవిని ఆదేశించారు.

ఎన్నికల జాబితాను పారదర్శకంగా చేపట్టాలి

ఏటూరునాగారం: ఎన్నికల జాబితాను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి పోర్టల్, కంప్యూటర్, రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకమైన ఓటరు జాబితా తయారు చేయాలని, ఓటర్ల జాబితాలో మార్పులు చేయడంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరస్వామి, డిప్యూటీ తహసీల్దార్ నితిష్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ భానుప్రసాద్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ్‌పురం గ్రామానికి చెందిన బాబురావు అనే వ్యక్తి అనారోగ్యంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయాడని, ఆ గ్రామంలో అందుబాటులో ఉంటూ వైద్యసేవలందించాలన్నారు. వరదలు తగ్గిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అరవిందరెడ్డి, డీపీఓ వెంకయ్య, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు, సర్పంచ్ చిడెం యామిలి తదితరులు ఉన్నారు.

వరదలతో అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వ చీఫ్ విప్ రేగ కాంతారావు

వెంకటాపురం(కె): గోదావరి వరదతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్ రేగ కాంతారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆలుబాక, బోదాపురం ,గ్రామ సమీపంలో గోదావరి వరద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో గోదావరి వరదలతో భద్రాచలం డివిజన్‌లో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురైయ్యాయన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో రహదారుల సక్రమంగా లేక పోవటంతో రహదారుల మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, నూగూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బోదేబోయిన బుచ్చయ్య, జెడ్పీటీసీ పాయం రమణ, గంపా రాంబాబు, పిళ్ళారిశెట్టి మురళి, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేగ కాంతారావు

అవసరమైతేనే బయటకు రావాలి

ఏటూరునాగారం: ఏజెన్సీ గ్రామాల ప్రజలు వర్షాలు, వరదల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద పార్టీ నాయకులతో కలిసి గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. మరో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తితే సహాయ చర్యలకు వెంటనే అధికారులు, బీఆర్ఎస్ శ్రేణులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమం జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు వలియాబీ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, ఎంపీపీ అంతటి విజయ నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు సునీల్ కుమార్, సయ్యద్ సర్ధార్ పాషా, మల్లారెడ్డి, మహేష్ గౌడ్, ఈసం స్వరూప, సర్పంచుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం రామ్మూర్తి, దొడ కృష్ణ, దేవేందర్, అల్లి సుమలత శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో గిరిజన గ్రామాలు

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఊరట్టం, ఎల్బాక, పడిగాపూర్ గిరిజన గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోవడంతో జన సంచారం లేకుండా పోయింది. ఊరట్టం తూముల వాగు పొంగిపొర్లడంతో ఊరట్టం బ్రిడ్జి కింద రోడ్డు డ్యాంపై భారీగా ప్రవహించడంతో పాటు జంపన్నవాగు ఊరట్టం కాజ్‌వేపై నుంచి కూడా జంపన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఊరట్టం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామానికి వెళ్లే రెండు ప్రధాన రహదారుల్లో కూడా ఉధృత వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎల్బాక, పడిగాపూర్ గ్రామాలకు మేడారం నుంచి వచ్చే దారి, నార్లాపూర్ చింతల్ నుంచి వచ్చే లోలెవల్ కాజ్ వే పై నుంచి జంపన్నవాగు వరదతో రాకపోకలు స్తంభించాయి. కనీసం ఆ గ్రామాల ప్రజలకు ఎటు వెళ్లాలన్నా రవాణా మార్గం లేకుండా పోయింది. దీంతో అవస్థలు పడుతున్నారు.

వరద ముంపులో గర్భిణులు

జలదిగ్బంధంలో ఉన్న ఊరట్టం గ్రామంలో తంగళ్లపల్లి రాధ, పులేందుల అనూష ఇద్దరు గర్భిణులు ఉన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి వర్షాల కారణంగా వరద ముంపు ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉన్న ప్రసూతి అయ్యే గర్భిణులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అయినా ఊరట్టం గ్రామంలో ఉన్న రాధ నిండు గర్భిణీతో ఉన్నా.. ఆమెను తరలించకపోవడం గమనార్హం. ఈ విషయంలో వైద్యాధికారులు కింద స్థాయి ఆశలు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలను అప్రమత్తంగా చేయకపోడంతో ఊరట్టంలో గర్భిణీలు ఉన్న విషయాన్ని గుర్తించలేదు. ప్రస్తుతం ఊరట్టం జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో గర్భిణీలు గ్రామం నుంచి బయటకి రాలేని పరిస్థితి నెలకొంది.



ఊరట్టం రోడ్డు డ్యాంపై భారీగా ప్రవహిస్తున్న వరదనీరు

27.9 అడుగులకు చేరిన రామప్ప సరస్సు నీటిమట్టం

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేట పరిధిలో గల రామప్ప సరస్సు ఇటీవల కురుస్తున్న వర్షాలతో జలకళను సంతరించుకుంది. 25 అడుగుల నీరు ఉన్న రామప్ప సరస్సు నీటిమట్టం ఇటీవల కురిసిన వర్షాలకు 27.9 అడుగులకు చేరుకొంది. 35 అడుగుల నీటిసామర్థ్యం గల రామప్ప సరస్సులోకి పూర్తిగా నీటిమట్టం నిండినట్లయితే రామప్ప సరస్సు పరిధిలోని రైతులకు రెండేళ్లపాటు పంటలు పండనున్నాయి.



నీటితో కళకళలాడుతున్న రామప్ప సరస్సు

అంకితభావంతో పనిచేయాలి

డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య

వెంకటాపురం(కె): ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు అంకిత భావంతో పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అల్లెం అప్పయ్య అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు మండల పరిధిలోని సీతరాంపురం గ్రామాన్ని వాగులు దాటుకుంటూ వెళ్లి సందర్శించి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని 42 కుటుంబాలను 20 మంది ఆశ వర్కర్లతో పది మంది ఏఎన్ఎంలతో ఇంటింటి సర్వే చేశారు. దోమలు వ్యాప్తి చెందకుండా యాంటి లార్వాను స్ప్రెయింగ్ చేయించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనారోగ్యంతో మృతి చెందిన బాబురావు కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ, ఎంపీటీసీ భిక్షవతి, బోదాపురం సర్పంచ్ రాధ, వైద్యాధికారి భవ్యశ్రీ, కుక్మాకర్ రెడ్డి ఉన్నారు.



వాగు దాటుతున్న డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య

సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలి

ములుగు: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న పాత పెన్షన్ సాధన సంకల్పయాత్రను విజయవంతం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థిత ప్రజ్ఞ చేపడుతున్న రథయాత్ర నేడు(శనివారం) ఉదయం 10 గంటలకు ములుగు జిల్లాకు చేరుకుంటుందని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అనుబంధ సంఘాలు భారీగా తరలిరావాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

డీపీఓ వెంకయ్య

వెంకటాపురం(కె): మండలంలో 18 పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డీపీఓ వెంకయ్య అన్నారు. శుక్రవారం మండలంలో ఆయన పర్యటించారు. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉన్నందున అదనపు సిబ్బందితో గ్రామాల్లో వర్షాకాలం సీజన్‌లో పారిశుద్ధ్య పనులను నిర్వహించాలన్నారు. అనంతరం వెంకటాపురం మండలకేంద్రంలో అదనపు సిబ్బందితో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రహీం, సర్పంచ్ చిడెం యామిలి, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నేటి నుంచి ఇంటింటికి ఫీవర్ సర్వేను మొదలు పెట్టాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు చెత్తాచెదారం, బురద గుంటలు లేకుండా చూడాలన్నారు. అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందితో చికిత్సలు చేయించాలన్నారు. పాఠశాలల పరిసరాల్లో బ్లీచింగ్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ఉన్నారు. అనంతరం మండలంలోని ఎక్కెలలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంప్‌ను సీఈఓ ప్రసూనరాణి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి అశోక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న డీపీఓ

ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

తగ్గుతూ..పెరుగుతూ..

ఏటూరునాగారం: గోదావరి నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తుండడంతో ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటి మట్టం శుక్రవారం తగ్గుతూ.. పెరుగుతూ ఉంది. ఉదయం 13.30 మీటర్లు ఉండగా సాయంత్రం 6 గంటలకు 13.49 మీటర్లకు చేరింది. అయితే గోదావరి రేపటి వరకు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా మండల కేంద్రంలో ప్రవహిస్తున్న జంపన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో జంపన్నవాగు వెంట ఉన్న కరకట్ట గేట్లను మూసివేశారు. అలాగే మండలంలోని ఎలిశెట్టిపల్లి గ్రామానికి బహ్యాప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అటవీమార్గంలో వస్తున్నప్పటికీ గోతుల్లో వాహనాలు దిగబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు అడవి మార్గం, మరోవైపు వాగు మార్గం కావడంతో ఎలిశెట్టిపల్లి, కొత్తూరు ప్రజలు నరకం చూస్తున్నారు. ప్రభుత్వ అధికారులు వాగు వద్ద ఎలాంటి పడవలు ఏర్పాటు చేయలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.




రామన్నగూడెం వద్ద నిలకడగా ఉన్న గోదావరి నది


టీఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఏటూరునాగారం: ఇద్దరు గిరిజనులకు ఐటీడీఏ పీఓ అంకిత్ శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ట్రైబల్ రిలీఫ్ ఫండ్ (టీఆర్ఎఫ్) నుంచి చెక్కులను అందజేశారు. గోవిందరావుపేట మండలం గాంధీనగర్‌కు చెందిన మాలోతు చందూలాల్ కుమార్ చెరువులో పడి మృతి చెందగా అతడికి రూ.25వేలు, తాడ్వాయి మండలం ఊరట్టం గ్రామానికి చెందిన కోట నర్సయ్య కుమారు కిడ్నీ వ్యాధితో మృతి చెందగా రూ. 25వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ దామోదరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న పీఓ అంకిత్


వెంకటాపురం(కె) : ముత్యంధార జలపాతం


గంగారం : ఏడుబావుల లొద్ది జలపాతం


వాజేడు : బొగత జలపాతం



బయ్యారం : జాలువారుతున్న పాండవుల జలపాతం, వెంకటాపురం (కె): మహితాపురం జలపాతం

ఫొటో స్టోరీ

కనువిందు చేస్తున్న జలపాతాలు

భారీ వర్షాలతో వస్తున్న వరదలతో మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని జలపాతాలు పర్యాటకులను కనివిందు చేస్తున్నాయి. బయ్యారం మండలంలోని వంకమడుగువాగుపై ఉన్న చింతోనిజలపాతం, బయ్యారం గుట్టపై ఉన్న పాండవుల జలపాతం పై నుంచి లోతైన ప్రాంతంలో జాలువారుతున్న నీటి అందాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప దట్టమైన అడవిలో ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన భీమునిపాద జలపాతం పర్యాటక కేంద్రంగా పేరు గాంచింది. గంగారం మండలంలోని కొడిశలమిట్ట అటవీ ప్రాంతంలోని ఏడుబావుల లొద్ది పర్యాటకులను వర్షాకాలం ఆకర్షిస్తోంది. ఏడు బావుల లొద్ది నుంచి జలపాతం గలగలపారుతూ నేలను తాకుతుండడంతో... చుట్టూ పచ్చదనంతో అడవి... కోకిల రాగాలతో కనువిందు చేసేలా ఏడుబావుల లొద్ది పర్యాటకులను ఆకర్షిస్తోంది. ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం, వెంకటాపురం మండలంలోని వీరభద్రవరం సమీపంలోని ముత్యంధార జలపాతం, మహితాపురం జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. జలపాతాల అందాలను చూసేందుకు మండల వాసులతో పాటు ఖమ్మం, ఇల్లందు, గార్ల, డోర్నకల్, కురవి, మహబూబాబాద్, గూడూరు, నర్సంపేట హైదరాబాద్ ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తున్నారు.

- బయ్యారం/గూడూరు/గంగారం/వెంకటాపురం(కె)/వాజేడు


గూడూరు: భీమునిపాద జలపాతం


బయ్యారం: బొల్లిజలపాతం

పోక్సో కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

మరిపెడ: పోక్సో కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.9వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు సివిల్ జడ్జి చంద్రశేఖర ప్రసాద్ శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పడమటిగూడెం శివారు బాల్యతండాకు చెందిన బాలిక మరిపెడలోని సోషల్ వెల్ఫేర్‌లో 5వ తరగతి చదువుతుంది. ఈ నేపథ్యంలో పడమటిగూడెం తండాకు చెందిన పవన్‌కుమార్ బాలికను వసతిగృహం నుంచి పేరెంట్ అని చెప్పి ఆగస్టు 22, 2022లో వెంట తీసుకెళ్లి మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారులో అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం తొర్రూర్ సివిల్ కోర్టులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 9 వేలు జరిమానా విధించినట్లు పీపీ పద్మాకర్‌రెడ్డి చెప్పారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

విద్యారణ్యపురి: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా విద్యాసంస్థలకు సెలవు ఉంటుంది. ఈ మేరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారని హనుమకొండ డీఈఓ ఎండి అబ్దుల్‌హై తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈనెల 20, 21న కూడా సెలవులు ఇచ్చిన విషయం విదితమే. 23 ఆదివారం 24న విద్యాసంస్థలు తెరుచుకుంటాయి.



ఆమడ దూరంలో ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు


వరంగల్ కేఎంసీ మెటర్నిటీ ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రం


మాట్లాడుతున్న ఐసీటీసీ కేంద్రం నిర్వాహకులు

- కీలకమైన వరంగల్ కేఎంసీ సెంటర్ ఎత్తివేత..?

సాక్షిప్రతినిధి, వరంగల్: హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) పేరుతో ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, కౌన్సెలింగ్ (ఐసీటీసీ) కేంద్రాలను కుదించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో) ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ మేరకు జూలై 5న న్యాకో జారీ చేసిన సర్క్యులర్ నంబర్ 11025 పట్ల ఆ సంస్థ సిబ్బంది ఆందోళనలో పడ్డారు. ఎయిడ్స్ రోగులు సైతం అయోమయానికి గురవుతున్నారు.

ఐసీటీసీ కేంద్రాన్ని ఎత్తేయడం సమంజసం కాదు

ఎంజీఎం :పేద గర్భిణీలకు ఉత్తమ సేవలందిస్తున్న వరంగల్ సీకేఎం ఆస్పత్రి ఐసీటీసీ కేంద్రం ఎత్తివేయడం సమంజసం కాదని ఐసీటీసీ కేంద్ర నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా ప్రప్రథమంగా 2002 నాకో సీకేఎం ఆస్పత్రిలో ఎస్‌పీసీఎస్ ఆధ్వర్యంలో ఐసీటీసీ కేంద్రాన్ని నెలకొల్పారు. ఈ కేంద్రం ద్వారా ఆస్పత్రిలో 3 వేల పరీక్షలు చేయడంతో పాటు 8 హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న ప్రసవాలు చేసి తల్లి నుంచి బిడ్డకు వ్యాధి సోకకుండా చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. గత 21 ఏళ్లుగా వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులలో చికిత్సలు అందించినట్లు తెలిపారు. కేంద్రం ప్రారంభమైన నాటి నుంచి 3,52,766 పరీక్షలు నిర్వహించి 1347 పాజిటివ్‌లు రాగా ఇందులో 1089 డెలివరీలు చేసినట్లు తెలిపారు. అలాగే పిల్లలకు 18 నెలల వరకు ఫాలోఅప్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో పనిచేస్తున్న నలుగురు కౌన్సిలర్లు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు పని చేస్తున్నారని, రాష్ట్రంలో రెండుసార్లు ఉత్తమ అవార్డులు తీసుకున్నారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఎత్తివేసే కేంద్రాలు ఇవే ...

వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజ్ (కేఎంసీ) ఆవరణలోని ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, కౌన్సెలింగ్ (ఐసీటీసీ), జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గల రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోని రెండు ఐసీటీసీ కేంద్రాలు మహాదేవపూర్, చిట్యాల. మహబూబాబాద్ జిల్లాలో గూడూరు, వరంగల్ జిల్లాలో సీకేఎం మెటర్నిటీ హాస్పిటల్‌లలో గల ఐసీటీసీ కేంద్రాల ఎత్తివేతకు రంగం సిద్ధం కావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

నేడు కేఎంసీలో 'రీసెర్చ్' డే

- హాజరుకానున్న మంత్రి హరీశ్‌రావు


బుక్ ఆవిష్కరిస్తున్న ఎన్ఆర్ఐ అసోసియేషన్ బాధ్యులు

ఎంజీఎం: మెడిసిన్ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు శనివారం కేఎంసీలోని ఎన్ఆర్ఐ బిల్డింగ్‌లో విద్యార్థులకు 'రీసెర్చ్ డే' నిర్వహించనున్నట్లు ఎన్ఆర్ఐ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సుజిత్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెడిసిన్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో సృజనాత్మకత తగ్గిందని గ్రహించి, వాటిని పెంపొందించేందుకు ఈ రీసెర్చ్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని శనివారం రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు సుజిత్ పేర్కొన్నారు. మొదటి దశలో ఇక్కడ నిర్వహించిన ఫలితాలను బట్టి దీన్ని మొత్తం భారతదేశం మొత్తం అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనికి కావాల్సిన వనరులను మొత్తం ఎన్ఆర్ఐ అసోసియేషన్ భరిస్తుందని తెలిపారు. రీసెర్చ్ డేలో భాగంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మెడిసిన్ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం రీసెర్చ్ డేకు సంబంధించిన పుస్తకాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ అసోసియేషన్ సెక్రెటరీ డాక్టర్ అనుపమ, వైస్ ప్రెసిడెంట్‌లు డాక్టర్ వేణు, డాక్టర్ సుబ్రమణ్యేశ్వర్‌రావు, డాక్టర్ వి.లక్ష్మి నరసింహారావు, డాక్టర్ మోహన్‌దాస్, రోహిత్, సాయికిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ మావోయిస్టుల అరెస్ట్

వెంకటాపురం(కె): మావోయిస్టుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురు నకిలీ మావోయిస్టులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మావోయిస్టు ఏరియా కార్యదర్శి సుధాకర్ పేరుతో ఇసుక కాంట్రాక్టర్ల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై తిరుపతిరావు, సిబ్బందితో కలిసి వెంకటాపురం గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ శివారులో ముగ్గురు వ్యక్తులు బ్యాగ్‌తో అనుమానాస్పదంగా కనిపించి పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 10 వేల నగదు, రెండు బొమ్మ తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ముగ్గురిని విచారించగా మంగవాయి గ్రామానికి చెందిన తాటి సురేష్, మంగులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా జారువ గ్రామం, గోట రాజస్తాన్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా కాండే గ్రామానికి చెందిన వారుగా తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.


అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఐ ఫోన్ గెలుచుకున్నావు..

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో యువకుడు
- బ్యాంకు ఖాతాలో రూ.29 వేలు మాయం

ఖిలా వరంగల్: ఐ ఫోన్ గెలుచుకున్నావంటూ మొబైల్‌కు మెసేజ్..కాల్ రాగా దీనిపై ఓ యువకుడు స్పందించి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి రూ.29వేలు పోగొట్టుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం ఖిలావరంగల్‌లో వెలుగుచూసింది. బాధితుడి కథనం ప్రకారం మధ్యకోటకు చెందిన హైమద్ అలీ మొబైల్‌కు శుక్రవారం సైబర్‌నేరగాడు 7837905596 నంబర్‌ను నుంచి మేసేజ్.. ఆ తర్వాత కాల్ వచ్చింది. తనయుడి చేతిలో ఉన్న తండ్రి మొబైల్‌కు వచ్చిన మేసేజ్‌పై వెంటనే యువకుడు స్పందించాడు. మీకు ఐ పాడ్ మొబైల్ గెలుచుకున్నావంటూ మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని సైబర్ నేరగాడు కాల్ చేసి అడిగాడు. ఆ యువకుడు ఆనందంతో ఓటీపీ చెప్పాడు. క్షణాల్లోనే తండ్రి బ్యాంకు ఖాతా నుంచి రూ.29 వేల నగదు మాయమైనట్లు మెసేజ్ వచ్చింది. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కానని బ్యాంకు ఖాతాను బ్లాక్ చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు హైమద్ అలీ తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

కాశిబుగ్గ : సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేసే వరకు పోరాటం ఆగదని తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఆలంపూర్ జోగులాంబ దేవాలయం నుంచి చేపట్టిన సంకల్ప రథయాత్ర శుక్రవారం సాయంత్రం వరంగల్‌కు చేరుకుంది. ఓ సిటీ మైదానం వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ 2004 నుంచి ఆమల్లోకి వచ్చిన సీపీఎస్ విధానంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాత పెన్షన్ విధానం సాధించడమే ఈ సంకల్ప రథయాత్ర లక్ష్యమన్నారు. అనంతరం ఉద్యోగులు రథయాత్రతో పాటు బైక్ యాత్ర వెంకట్రామ జంక్షన్, కాశిబుగ్గ, పోచమ్మమైదాన్, ఎంజీఎం, ములుగు రోడ్డు మీదుగా హనుమకొండ కీర్తిస్తూపం వరకు బైక్ ర్యాలీ సాగింది. ఈ యాత్రలో జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్, వివిద శాఖల సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.


ఓ సిటీ మైదానంలో స్థితప్రజ్ఞకు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

పెండింగ్ కేసుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీఐడీ

వరంగల్ లీగల్: చాలా కాలంగా విచారణలో ఉన్న పలు కేసుల్లో వరంగల్ రీజనల్ సీఐడీ పోలీసులు శుక్రవారం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2010 ఖమ్మం జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన లజ్జ కేసుగా పేరు గాంచిన ఈ కేసును మతవైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా..దురుద్దేశ పూరిత వ్యాఖ్యలతో కూడిన రెండు వ్యాల్యూమ్స్‌తో కూడిన బుక్స్ ముద్రించిన నేరంపై ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. మహ్మద్ ప్రవక్త, ముస్లిం పవిత్ర గ్రంథమైన ఖురాన్‌పై వివాదపరమైన వ్యాఖ్యలు రాసిన దానిపై నిషేధిత సల్మాన్ ఖుర్షీద్ రాసిన సటానిక్ వర్సెస్, తస్లీమా నస్రీన్ రాసిన లజ్జ పుస్తకం ..నిషేధించిన పుస్తకాల నుంచి రాసిన కథనాలపై కేసు నమోదు చేశారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మన్నపేట పోలీస్‌స్టేషన్‌లో 2016లో నమోదైన కేసులో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి శ్రీలంకలోని కొలంబోకు తీసుకెళ్లి రూ.5 లక్షలకు కిడ్నీ మార్పిడి చేశారు. అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ కేసులో శ్రీలంకతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 10 మందిపై కేసు నమోదు చేశారు. అలాగే సింగరేణి మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ పరీక్షల్లో మోసపూరితంగా కుట్ర చేసి ఓ వ్యక్తి బదులు మరో వ్యక్తితో పరీక్ష రాయించిన కుట్రలో సుంచుపెల్లి పోలీస్‌స్టేషన్‌లో 9 మందిపై కేసు నమోదు చేశారు. అలాగే స్టేట్‌బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ కేసముద్రం బ్రాంచిలో ముద్ర లోన్‌గా పేరుగాంచిన కేసులో 9 మంది నిందితులపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ లబ్ధిదారులతో కుమ్మక్కై తప్పుడు పత్రాలు సృష్టించి సంతకాలు ఫోర్జరీ చేసి ఒక్కొక్కరిపై రూ.6 లక్షలు మొత్తం రూ.54 లక్షలు లోన్ మంజూరు చేశారు. దీనిపై ఇరువురు బ్యాంకు అధికారులు, తొమ్మిది మంది లబ్ధిదారులపై కేసు నమోదు చేశారు. ఆయా కేసుల్లో విచారణ చేపట్టి శుక్రవారం వరంగల్ సీఐడీ అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

2012 బ్యాచ్ ఎస్సైలకు పదోన్నతి

వరంగల్ క్రైం: రాష్ట్రంలో 2012 బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పలువురికి పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారిలో భూక్య శంకర్, కొత్తపల్లి అశోక్ కుమార్, పెండ్యాల దేవేందర్, సీహెచ్.కరుణాకర్‌రావు (ములుగు), నందునూరి చంద్రమోహన్ ఉన్నారు. పదోన్నతి పొందిన అధికారులను పలువురు పోలీస్ అధికారులు అభినందించారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి


భూక్య రమేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని దర్గతండ గ్రామపంచాయతీ పరిధిలోని టేకులగూడెంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై బీ.రాంచరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకులగూడెంకు చెందిన రైతు భూక్య రమేష్ (35) తన వ్యవసాయ భూమి వద్ద ఉన్న బావి వద్దకు వెళ్లాడు. బావికి సంబంధించిన స్టార్టర్ బోర్డు పాకాల వాగు వరద ఉధృతి పెరగడంతో అందులో పడి తడిసిపోతుందని ఆందోళనతో అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానిక రైతులు గమనించి చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కల్యాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వలలో చిక్కి మత్స్యకారుడు..


నాగయ్య మృతదేహం

దేవరుప్పుల : నాలుగు దశాబ్దాలుగా కులవృత్తిని న మ్ముకొని జీవిస్తున్న మత్స్యకారుడు ఆసరా ఇచ్చిన చేపల వలలోనే చిక్కి మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం మాదాపురంలో చోటుచేసుకుంది. మండలంలోని మాదాపురంలో ముదిరాజ్ కులానికి చెందిన బొందుగుల నాగయ్య (55) గ్రామసమీపంలోని గరికచెరువు మత్తడి పోయడంతో చేపలు పట్టేందుకు వలతో వెళ్లాడు. చేపల కోసం వల విసిరిన అతను తీసేందుకు యత్నించే క్రమంలో ఈత వచ్చినప్పటికీ వలలో చిక్కుకొని లోతుగా ఉన్న నీళ్లలో పడి నీటమునిగాడు. సమీపంలో పశువులను కాస్తున్న నాగయ్య మేనల్లుడు శివతేజ గమనించి కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం అందించారు. నీటమునిగిన నాగయ్యను బయట తీసి పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. సంఘటనస్థలానికి హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్.శ్రీనివాస్ చేరుకొని భార్య ఉప్పమ్మ ఫిర్యాదు మేరకు శవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

28 కిలోల ఎండు గంజాయి స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ డేవిడ్‌రాజ్

కాజీపేట: ఎండు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. శుక్రవారం రాత్రి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ సార్ల రాజుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సై బండారి రాజు పెట్రోలింగ్ చేస్తుండగా ఇద్దరు యువకులను అనుమానాస్పదంగా నాలుగు బ్యాగులతో కనిపించగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆ బ్యాగుల్లో 28 కిలోల శుద్ధి చేసిన ఎండు గంజాయి లభించిందన్నారు. మహారాష్ట్రలోని జల్నా జిల్లాకు చెందిన ఫిరోజ్ అహ్మద్ పటేల్, షేక్ షఫీక్, షేక్ గయాస్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గంజాయి విలువ దాదాపు రూ.5.60 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్సైలు బండి రాజు, ప్రమోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ పరిధిలోని నేటి పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలో ఈనెల 22న నిర్వహించాల్సిన పలు పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. బీ ఫార్మసీ 8వ సెమిస్టర్, ఫార్మాడి నాల్గవ సెమిస్టర్, బీటెక్ ఫస్టియర్ అలాగే బీఫార్మసీ నాన్ సీబీసీఎస్ నాల్గవ, మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశామని తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈనెల 20, 21 తేదీల్లో జరగాల్సిన పరీక్షలు కూడా వాయిదా పడిన విషయం విదితమే. వాయిదా పడిన పరీక్షల రీషెడ్యూల్‌ను శనివారం విడుదల చేస్తామని వారు తెలిపారు.